

మోస్తరు వర్షం

ఘట్‌కేసర్/వికారాబాద్, ఆగస్టు 16: ఘట్‌కేసర్‌లో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. ఓవైపు ఎండ మరోవైపు వర్షం ఇలా అరగంట పాటు మోస్తరు వర్షం కురిసింది. సరిపడా వర్షాలు కురియక ఎండ తీవ్రత పెరిగి ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.భారీ వర్షం కురిసి చెరువులు, కుంటల్లోకి నీరు చేరేదాకా ఉక్కపోత తప్పేటట్లు లేదని జనాలు వాపోతున్నారు. అంతేకాకుండా వికారాబాద్‌లో కూడా మోస్తరు వాన కురిసింది.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు





వికారాబాద్: వైభవలక్ష్మీ ఆలయంలో భక్తుల పూజలు

వికారాబాద్/ఘట్‌కేసర్ రూరల్/తాండూరు, ఆగస్టు 16 : వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల వ్యాప్తంగా మహిళలు వరలక్ష్మీ వ్రతాలను అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరించారు. సామూహిక వరలక్ష్మీ వ్రతాలు సంస్కృతీ సంప్రదాయాన్ని చాటాయి. తెలుగింటి ఆడపడుచులకు సౌభాగ్యాన్ని, ఐశ్వర్యాన్ని ఇచ్చే పండుగైన వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు సంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు. ఆలయాలలో మహిళలు పెద్ద సంఖ్యలో వ్రతాలు నిర్వహించారు. వాయనాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయాలు, ఇళ్లను శోభాయమానంగా అలంకరించారు. ఏ ఇంట చూసిన శ్రావణ వరలక్ష్మీ శోభ, ఆధ్యాత్మిక వాతావరణం వెల్లి విరిసింది. దేవాలయాలతో పాటు ఇళ్లల్లో లక్ష్మీదేవిని ప్రతిష్ఠించి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు, వ్రతాలు చేశారు. తమ కుటుంబాలను చల్లంగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు.



గాజుల అలంకరణలో అమ్మవారు



ఘట్‌కేసర్ రూరల్ : మహంకాళి ఆలయంలో అమ్మవారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

రేణుకాఎల్లమ్మ గాజుల ఉత్సవం

తాండూరు పట్టణం నెహ్రూగంజ్ లో వెలసిన శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారికి గాజుల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా ఆలయ పూజారి అంబరేష్ గాజులతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మందుల కొరత లేకుండా చూడాలి



హెల్త్ సెంటర్‌లో మందులను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ టౌన్, ఆగస్టు 16: ఆస్పత్రికి వచ్చే రోగులకు మందుల కొరత లేకుండా చూడాలని, మెరుగైన వైద్యసేవలు అందించాలని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. శుక్రవారం మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కకాటు గురైన వారు వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన వెంటనే వారికి చికిత్స అందించి. వివరాలు స్థానిక మున్సిపల్ అధికారులకు ఇవ్వాలన్నారు. దీంతో మున్సిపల్ వారు కుక్కలను నియంత్రించడానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రస్తుతం సీజన్‌లో విషజ్వరాలు ప్రబలకుండా మున్సిపల్, గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాలకు సంబంధించిన పరీక్షలు సత్వరం జరిపి తక్షణమే రోగులకు వైద్య సేవలందించాలని సూచించారు. ఆసుపత్రుల్లోని ల్యాబుల్లో ర్యాపిడ్ కిట్లను, ఇతర పరికరాలను, మందులను సిద్ధంగా వుంచుకోవాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్, మందుల స్టోర్‌రూం, ఓపీ పేషంట్ల వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రఘునాథస్వామి, మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. .



జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల గేటు ముందు కాలువలో నిలిచిన మురుగు

గురుకుల పాఠశాల సమీపంలో అపరిశుభ్రత

- విద్యార్థులు వ్యాధుల బారిన పడే అవకాశం

పెద్దేముల్, ఆగస్టు 16 : మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దోమల వ్యాప్తికి నిలయంగా మారింది. పారిశుధ్య నిర్మూలన చేపట్టకపోతే విద్యార్థులు వ్యాధుల బారినపడే అవకాశం ఉంది. పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామ సమీపంలో జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల భవనం కొనసాగుతోంది. గురుకుల పాఠశాల కాంపౌండ్ వాల్‌ను ఆనుకునే కోట్‌పల్లి ప్రాజెక్టు కాలువ ఉంది. కాలువలో మురుగునీరు చేరి అపరిశుభ్రంగా మారింది. గురుకుల పాఠశాల ఎదుటనే కాలువ గుంతగా మారడంతో అందులో వర్షపు నీరు చేరి కంపుకొడుతోంది. దోమలవ్యాప్తికి కారణమవుతోంది. ఇక్కడ గురుకుల పాఠశాలలో చిన్నపిల్లలు ఉన్నందున వారు దోమలకాటుకు గురై వ్యాధుల బారినపడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి గురుకుల పాఠశాల గేటుముందు కాలువలో మడుగుకట్టిన నీటిని తొలగించేందుకు ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. పిల్లలు అనారోగ్యాల బారిన పడకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.



తాండూరు - కొడంగల్ మార్గంలో రహదారి ఎత్తు పెంచేందుకు వేసిన కంకర

తాండూరు మీదుగా జాతీయ రహదారుల నిర్మాణానికి సర్కారు శ్రీకారం చుట్టింది. పొరుగు రాష్ట్రాలకు రాకపోకలు కొనసాగించడానికి ఎక్కువ సమయం, అదనపు వ్యయం అవుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సహకారంతో అంతర్రాష్ట్ర రవాణా రంగానికి అనుసంధానమయ్యే జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టనున్నారు. ఇప్పటికే హైవే పనులు శరవేగంగా సాగుతున్నాయి. తాండూరు నియోజకవర్గంలో రహదారుల కష్టాలు లేకుండా ప్రత్యేక ప్లాన్‌తో రోడ్లను అనుసంధానించే పనులు చురుగ్గా సాగుతున్నాయి.



- చించోళి టు తాండూరు మీదుగా మహబూబ్‌నగర్
- శరవేగంగా సాగతున్న హైవే పనులు
- మెరుగుపడనున్న అంతర్రాష్ట్ర రాకపోకలు
- కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీకి ప్రయాణం సులభతరం
- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు

ఇక.. రయ్ రయ్!

తాండూరు మీదుగా జాతీయ రహదారి

తాండూరు, ఆగస్టు 16: తాండూరు మీదుగా జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పొరుగు రాష్ట్రాలకు రాకపోకలు కొనసాగించడానికి ఎక్కువ సమయం, అదనపు వ్యయం అవుతున్న నేపథ్యంలో తక్కువ సమయంతో పాటు వృథా ఖర్చు తగ్గేలా కేంద్ర ప్రభుత్వం సహకారంతో అంతర్రాష్ట్ర రవాణా రంగానికి అనుసంధానం అయ్యే జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం రూ.35 కోట్ల వ్యయంతో కర్ణాటక రాష్ట్రం చించోళి నుంచి మహబూబ్‌నగర్ జాతీయ రహదారి నిర్మాణం పనులు చేపట్టారు. ఈ నెల 5న రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈరోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. 130కిలోమీటర్లు జాతీయ రహదారి కింద నాలుగు వరుసల రోడ్డుగా మారనుంది. ఇప్పటికే లక్ష్మీనారాయణపూర్ నుంచి కొడంగల్ వరకు 12 కిలోమీటర్లు, తాండూరు శివారు నుంచి కర్ణాటక సరిహద్దు మిర్యాన్ వరకు 13 కిలోమీటర్ల మేర పనులు వేగంగా కొనసాగుతున్నాయి. రోడ్డు ఎత్తు పెంచడం, కంకర వేయడం, అవసరమైన చోట బీటీ వేయడం, డివైడర్లు, కల్వర్టులు నిర్మించడం వంటి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. తాండూరు పట్టణంలో రోడ్డు మధ్యలో డివైడర్ల నిర్మాణం పనులు శేష్‌ప్రభ థియేటర్ సమీపం నుంచి ఫ్లైఓవర్ వరకు పనులు పూర్తయ్యాయి. రోడ్డుపై నీరు నిల్వకుండా రోడ్డు ఇరువైపులా పెద్ద డ్రైనేజీ నిర్మాణం పనులు చేపట్టారు. ఈ రోడ్డు పూర్తయితే కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మార్గ మధ్య నుంచి వెళ్లేందుకు వీలవుతుంది. తాండూరు మీదుగా నిర్మిస్తున్న జాతీయ రహదారి రాకపోకలకు ప్రధానంగా నిలవనుంది. ఈ రహదారి నిర్మాణం పనులు పూర్తయితే తాండూరు, కొడంగల్, మహబూబ్‌నగర్ నియోజకవర్గాల ప్రజలకు రవాణా కష్టాలు తీరనున్నాయి. కొడంగల్ - కోస్గి మధ్య కూడా 20 కిలోమీటర్లు కల్వర్టులు, బ్రిడ్జీల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

తాండూరు మీదుగా...

అంతేకాకుండా తాండూరు మీదుగా మరో జాతీయ రహదారి (నేషనల్ హైవే) నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఈ ప్రతిపాదనలున్నాయి. హైదరాబాద్ టు మన్నెగూడ-వికారాబాద్- తాండూరు మీదుగా జహీరాబాద్-బీదర్ వరకు నాలుగు వరుసల రహదారిని నిర్మించే ప్రతిపాదన ఉంది. ఈ రోడ్డు అప్‌గ్రేడేషన్ అంశం కేంద్రంలో పెండింగ్ ఉంది. 2022, జూలై 7న రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఈ రోడ్డు ప్రతిపాదనలను పంపింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రతిపాదనల్లో ఉన్న అలైన్‌మెంట్‌లో మార్పులు ఉండే అవకాశాలున్నాయి. ఈ విషయమై తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, వికారాబాద్ ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ చర్చించినట్లు సమాచారం.

రహదారుల కష్టాలు తీరేలా ప్లాన్

తాండూరు నియోజకవర్గంలో రోడ్డు, రహదారుల కష్టాలు లేకుండా ప్రత్యేక ప్లాన్‌తో రోడ్లను అనుసంధానించే కార్యక్రమం చేపడుతున్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సరిహద్దు నియోజకవర్గాలైన కొడంగల్, పరిగి, వికారాబాద్ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలతో, సంబధిత అధికారులతో చర్చించి రోడ్ల అనుసంధానంతో రోడ్డు కనెక్టివిటీ పెంచి సమయం, ఖర్చు తగ్గేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఇందులో భాగంగా సీఎంరేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహి హిస్తున్న కొడంగల్ నియోజకవర్గం నుంచి తాండూరు నియోజకవర్గానికి అనుసంధానంగా ఉండే రుద్రారం-మర్పల్లి-నవాల్గ, నాగారం, మర్పల్లి ,మెట్లకుంట, రాస్నం, గోటిగకుర్దు, వయా పగిడిపల్లి, రుద్రారం, పగిడిపల్లి నుంచి అన్నారం-రుద్రారం, పరిగి నియోజకవర్గంతో తాండూరుకు అనుసంధానమైన దేవనూర్ - కొత్తూరు- బాగాయిపల్లి- మందిపురం- కొత్తూరు, గోరేపల్లి-విడిచర్ల- ఎన్నెపల్లి, వికారాబాద్ నియోజకవర్గంతో తాండూరుకు అనుసంధానమైన ధారూర్-మన్‌సాన్‌పల్లి రోడ్డు, అంతరాష్ట్ర రోడ్డు కింద గౌతాపూర్ - నిడిగుందే రోడ్డు అనుసంధానికి ప్రతిపాదనలు చేశారు.



ప్రత్యేక చొరవ చూపిస్తా..

పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారి మన్నెగూడ- వికారాబాద్- తాండూరు మీదుగా జహీరాబాద్-బీదర్ నేషనల్ హైవే రోడ్డు మంజూరు కోసం ఇప్పటికే కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని రాష్ట్ర ఆర్ అండ్‌బీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో కలిసి విజ్ఞప్తి చేశాం. ఈరోడ్డు నిర్మాణ పనులు త్వరగా మంజూరు అయ్యేలా చూడాలంటూ స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. అంతే కాకుండా కొడంగల్- తాండూరు రోడ్డు, కర్ణాటక - తాండూరు రోడ్ల అనుసంధానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం, ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే రవాణా వ్యవస్థ మెరుగ్గా ఉండాలి. సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కువమార్, ఎమ్మెల్యే రామోహన్‌రెడ్డిల సహకారంతో తాండూరు రూపురేఖలు మారనున్నాయి. ఏడాదిలోపు పూర్తి చేస్తాం. తాండూరుమీదుగా రెండు నేషనల్ హైవేలు వెళ్లనుండడంతో అభివృద్ధి పరుగులు పెట్టనుంది.

- మనోహర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే



లక్ష్మీనారాయణపూర్ - కొడంగల్ మధ్యన నిర్మిస్తున్న రోడ్డు , డివైడర్

బషీరాబాద్ ఎస్‌ఐపై విచారణకు ఆదేశం

బషీరాబాద్, ఆగస్టు 16: మైనర్ ప్రేమ వ్యవహారంలో దళిత మహిళను కొడుకు జాడ చెప్పాలని చిత్రహింసలకు గురిచేసి, తుపాకీతో కాల్చి చంపుతానని బెదిరించిన బషీరాబాద్ ఎస్ఐ రవికుమార్ పై ఎస్పీ నారాయణరెడ్డి విచారణకు ఆదేశించారు. వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలపై తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డితో ఆరా తీసి ఎస్ఐపై సమగ్ర విచారణ జరిపి రిపోర్టు చేయాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ ఘటనపై ఎస్పీ ఎస్ఐని తీవ్రంగా మందలించినట్లు తెలిసింది. 'ఆంధ్రజ్యోతి'లో తుపాకితో కాల్చి చంపేస్తా.. దళిత మహిళకు ఎస్ఐ చిత్రహింసలు అంటూ ప్రచురితమైన కథనం తాండూరు నియోజకవర్గ వ్యాప్తంగా అలజడి రేపింది. ఎస్ఐ తీరుపై ఎక్కడా చూసిన ప్రజల్లో చర్చలు వినిపించాయి.

దళిత మహిళను బెదిరించలేదు : ఎస్ఐ రమేష్‌కుమార్

నవాల్గకు చెందిన లోహడ కళావతి కొడుకు నరేశ్ బాలికను వెంట తీసుకెళ్లగా కేసు నమోదైందని, ఈ క్రమంలో కొడుకు జాడ తెలపాలని విచారించినట్లు బషీరాబాద్ ఎస్ఐ రమేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారి జాడ తెలుసుకునేందుకు కళావతిని పోలీస్‌స్టేషన్ పిలిచి విచారించానే తప్పా, ఆమె తనపై చేస్తున్న ఆరోపణలో నిజం లేదని తెలిపారు.

అనుమతి లేని నిర్మాణాలపై నజర్

- ట్యాక్స్ ఫిక్సేషన్‌కు కసరత్తు
- భవనాలను జల్లెడ పడుతున్న మున్సిపల్ అధికారులు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 16: గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించటానికి మున్సిపల్ సిబ్బంది యాక్షన్ ప్లాన్‌ను రూపొందించింది. అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను గుర్తించటానికి మున్సిపల్ పరిధిలోని భవనాలను జల్లెడ పడుతున్నారు. మున్సిపల్ తరఫున అనుమతి పొంది ఉన్న భవనాలతో పాటు అక్రమంగా నిర్మించుకున్న భవనాలకు పూర్తి అసీస్‌మేంట్ చేసి వార్షిక ట్యాక్ ఫిక్స్ చేయాలన్న ఉద్దేశంతో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో సిబ్బంది భవనాల కొలతలను తీసే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రస్తుతం పన్నుల రూపకంగా మున్సిపల్‌కు రూ.11కోట్ల వార్షిక ఆదాయం చేకూరుతోంది. ఈ ఆదాయాన్ని పెంచుకోవటాడానికి ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు అక్రమ నిర్మాణాలు చేపట్టిన భవనాలను అసీస్‌మేంట్ చేసి ట్యాక్సు ఫిక్స్ చేయాలని తీర్మానించిన విషయం తెలిసిందే. మున్సిపల్ పరిధిలో ఉన్న ఇళ్లకు, ఇతర బహుళ అంతస్తులు, గిడ్డంగులకు పూర్వం గ్రామ పంచాయతీ పాలనలో చేసిన అసీస్‌మేంట్ ప్రకారం వార్షిక పన్నులు వసూలు చేస్తున్నారు. కాగా మున్సిపల్‌గా ఏర్పడ్డాక రెండు అంతస్తులకు అనుమతులు పొంది నాలుగు, ఐదు అంతస్తుల వరకు నిర్మాణాలు చేపట్టిన భవనాలు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

మైసమ్మగూడ భవనాలకు మోక్షం

ఎడ్యుకేషన్ హబ్‌గా పేరుగాంచిన మైసమ్మగూడలో దశాబ్ద కాలంగా పెద్దఎత్తున అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ఇక్కడ ఉన్న మల్లారెడ్డి యూనివర్సిటీ, ఇతర కళాశాలల్లో వేలాది మంది విద్యార్థులు చదువుతున్నారు. దీంతో ఇక్కడ విద్యార్థుల హాస్టళ్లకు పెద్దఎత్తున డిమాండ్ ఉంది. దీంతో కొందరు అనుమతులు లేకుండా భవనాలు నిర్మించి హాస్టళ్ల నిర్వాహకులకు అద్దెకు ఇచ్చారు. ప్రతీ నెల లక్షల్లో అద్దెను తీసుకుంటున్నప్పటికీ పన్నులు మాత్రం చెల్లించడంలేదు. ఈ భవనాల నిర్మాణం అక్రమమన్న విషయం జగమెరిగిన సత్యం. అయినప్పటికీ రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు చూసీచూడనట్లు వదిలేశారు.



మైసమ్మగూడలో భవనాలను కొలిపిస్తున్న కమిషనర్ స్వామి

అసీస్‌మెంట్‌పై అనుమానాలు

మైసమ్మగూడలో అక్రమంగా నిర్మించిన భవనాలు స్థానిక ప్రజాప్రతినిధులు, పేరుగాంచిన బడా నాయకులవి కావడం గమనార్హం. ఈ భవనాలకు హాస్టల్ పేరు తప్పా, ఇంటి నెంబర్ గానీ అడ్రస్ గానీ ఉండవు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం అక్రమ కట్టడాలను కూల్చే ఆస్కారం లేకపోలేదు. ఇప్పటికే మైసమ్మగూడను విద్యాసంస్థలతో పాటు అక్రమ నిర్మాణాలకు హబ్‌గా మారింది. మున్సిపల్ పాలకవర్గానికి ఇంకా ఐదు నెలలు మాత్రమే గడువు ఉండటంతో భవనాల యజమానులు పాలకవర్గంపై ఒత్తిడి తీసుకొచ్చి అసీస్‌మేంట్ చేయించి నామమాత్రపు వార్షిక పన్ను చెల్లించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం నిర్మాణాల కోసం ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఆదాయానికి పెద్ద మొత్తాన గుండి కొట్టారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నిరసనల వెల్లువ

- మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపై భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు
- తారకరామారావు దిష్టిబొమ్మల దహనం

మేడ్చల్, ఆగస్టు 16, (ఆంధ్రజ్యోతి): మహిళల పట్ల మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు నిరసిస్తూ శుక్రవారం వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి. పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు వ్యక్తం చేసి కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే జీర్ణించుకోలేని కేటీఆర్ మహిళల పట్ల నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని నేతలు మండిపడ్డారు. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.




ఘట్‌కేసర్‌లో బీఆర్ఎస్ నేత కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



ఓపెన్ యూనివర్సిటీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొడంగల్ రూరల్, ఆగస్టు 16: కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గల అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2024- 2025 విద్యా సంవత్సరం డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ) కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రఫియా ఖానమ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు. డిగ్రీ 2015-16 నుంచి 2023-2024 వరకు అడ్మిషన్ పొంది ఫీజు సకాలంలో చెల్లించని వారు ఆగస్టు 31వ తేదీ లోపు ట్యూషన్ ఫీజు చెల్లించాలని సూచించారు.



నిరుద్యోగులకు వివిధ కోర్సుల్లో శిక్షణ

వికారాబాద్, ఆగస్టు 16: రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు బీసీడీడబ్ల్యూవో ఉపేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. రిఫ్రిజిటర్, వాషింగ్ మిషన్, ఎయిర్ కండిషనర్ రిపేర్, ఇన్‌స్టాలేషన్, గ్యాస్ ఛార్జింగ్‌కు 10వ తరగతి లేదా ఐటీఐ, డిప్లొమా, ఇంటర్మీడియట్, ఒకేషనల్ చదివిన వారు అర్హులని తెలిపారు. అదేవిధంగా ఎల్ టీవీ, ఓఎల్ఈడీ మానిటర్, మైక్రోవేవ్ ఓవెన్, వాటర్ ప్యూరిఫైర్ బేసిక్ ఏ రిపేర్, ఇన్‌స్టాలేషన్‌కు 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఒకేషనల్ అర్హత కలిగిన వారికి 90 రోజులపాటు శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ సంస్థ నుంచి నెలకు రూ.4వేల చొప్పున మూడు నెలలు ట్రెయినింగ్ పీరియడ్ స్టైఫండ్ ఇవ్వబడుతుందన్నారు. శిక్షణ సమయంలో స్టడీ మెటీరియల్, లంచ్, టీషర్ట్స్, బ్యాగ్, సర్టిఫికేషన్, ప్లేస్‌మెంట్ ఇవ్వబడుతుందని తెలిపారు. వయస్సు 18 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండి సంవత్సర ఆదాయము 5లక్షల లోపు ఉన్నవారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. 10వ తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. ఆగస్టు 24లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి


డీఆర్డీవో సాంబశివరావు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 16: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అభించాలని డీఆర్డీవో సాంబశివరావు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన ఎదులాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ అర్బన్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలను శుక్రవారం సందర్శించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా? పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సమస్యలు ఏమైనా ఉన్నాయానే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కిచెన్‌లో వంట సామగ్రిని, అన్నం, కూరలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగేశ్వర్‌రావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో సాంబశివరావు







నేటి నుంచి ఉర్సే-ఎ- షరీఫ్ ఉత్సవాలు

- ముస్తాబైన ముర్షద్ దర్గా
- నాలుగు రోజుల పాటు ఉర్సు



తాండూరు, ఆగస్టు 16: దశాబ్దాల చరిత్ర కలిగిన తాండూరు హజ్రత్ సయ్యద్ అబ్దుల్ సలీం పాషా సాహిబ్ ఖిబ్లాచిష్తి 78వ ఉర్సే షరీఫ్ ఉత్సవాలకు ముర్షద్ దర్గా ముస్తాబైయింది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ముతవల్లి సయ్యద్ అబ్దుల్ గనిపాషా ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఈనెల 17న (శనివారం) సాయంత్రం 5గంటలకు ఘసుల్ షరీఫ్, రాత్రి 7గంటలకు జల్సా ఫైజాన్-ఎ-అవలయా, 18న (ఆదివారం) గంధం, రాత్రి 7గంటలకు ఇంటి నుంచి బయల్దేరి 8 గంటలకు దర్గా షరీఫ్ చేరి సందల్ కార్యక్రమం, 19న (సోమవారం) దీపోత్సవం, రాత్రి 9.30గంటలకు ఖవ్వాలి, 20న (మంగళవారం) సమాజ్‌బాద్ ఫజర్ తిలావర్ ఖురాన్, ఫాతిహాఖ్వాలి, ప్రసాద వితరణ కార్యక్రమలుంటాయని నిర్వాహకులు సయ్యద్ అబ్దుల్ గని పాషాలు తెలిపారు. ఈ ఉత్సవాలకు తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని తాండూరు పట్టణం తాండూరు, పెద్దేముల్, బషీరాబాద్, యాలాల, మండలాల, కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి, బొంరాస్‌పేట్, కర్ణాటక రాష్ట్రం చించోళి, సేడేం, గుల్బార్గా ప్రాంతాల నుంచి వచ్చి పాల్గొంటారు. ఈ ఉత్సవాల్లో దీపోత్సవం, ఖవ్వాలి కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిర్వహిస్తారు. దర్గా, పరిసర ప్రాంతాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

నేడు భూకైలాస్‌లో శనీశ్వరుడికి పూజలు



భూకైలాస్‌లోని శనీశ్వరస్వామి

తాండూరు రూరల్, ఆగస్టు 16: మండలంలోని అంతారం తండాలో వెలిసిన భూకైలాస్ ద్వాదశ జ్యోతిర్లింగాల ఆలయంలో నేడు(శనివారం) శనీశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పురోహితులు తెలిపారు. శని త్రయోదశి సందర్భంగా పూజలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. భక్తులు ఉదయం 6గంటలకు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించాలన్నారు. పూజల్లో పాల్గొనే భక్తులు వక్కలు-5, ఖర్జూర పండ్లు-5, నువ్వులు నూనె-1, నల్లపువ్వు -100 గ్రాములు, నల్ల ద్రాక్ష-1/2, తమలపాకులు-11, నల్లజిల్లేడు పూలు లేదా ఆకులు, టెంకాయలు-2, నలుపు జాకెట్-1, లేదా నల్లదారం తీసుకురావాలన్నారు. అదేవిధంగా ఇనుముతో చేసిన వస్తువు దానం చేయాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు సెల్: 9010800769కు సంప్రదించాలని సూచించారు.

మోమిన్‌పేట్: మండలంలోని శనీశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుద్ధ త్రయోదశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ పురోహితుడు రాముశర్మ తెలిపారు. స్వామివారికి సామూహిక తైలాభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

పనుల్లో వేగం పెంచండి

- అమృత్ భారత్ పనులను పకడ్బందీగా చేపట్టాలి
- తాండూరు, సేడం స్టేషన్‌లను పరిశీలించిన డీఆర్ఎం



పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం

తాండూరు, ఆగస్టు 16: అమృత్ భారత్ పథకం కింద రైల్వేస్టేషన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని దక్షిణ మధ్య రైల్వేశాఖ డీఆర్ఎం భర్తేష్ కుమార్‌జైన్ ఆదేశించారు. తాండూరు రైల్వేస్టేషన్‌తో పాటు సరిహద్దులో నున్న కర్ణాటక రాష్ట్రం సేడం, రైల్వే స్టేషన్‌లో శుక్రవారం అమృత్ భారత్ కింద చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రైల్వేలో ఆధునీకరణ పనులను పకడ్బందీగా చేపట్టాలని ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలిగించవద్దని కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. రూ.27కోట్లతో తాండూరు రైల్వేస్టేషన్‌లో చేపడుతున్న ఆధునీకరణ పనులకు సంబంధించి పనులు ఏఏ దశలున్నాయి? ఏఏ పనులు పూర్తి చేశారు? ఇంకా చేయాల్సిన పనులేంటి? ఏమైనాఇబ్బందులు ఎదురవుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. వెయిటింగ్ హాల్, టికెట్ బుకింగ్ కౌంటర్లు, పార్కింగ్ స్థలం, ఎక్సలేటర్ వంటి తదితర పనులు ఎంత వరకు వచ్చాయని ఆయన అడిగారు. ఈ పనులు పురోగతిలో ఉన్నట్లు కాంట్రాక్టర్ వివరించారు.

వైభవంగా గ్రామదేవతల పునఃప్రతిష్ఠాపనోత్సవం

కొత్తూర్‌లో సంతరించుకున్న ఆధ్యాత్మిక శోభ



సర్వాంగ సుందరంగా నిర్మించిన పోచమ్మ ఆలయం



పోచమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దంపతులు

కొత్తూర్, ఆగస్టు 16: మున్సిపాలిటీలోని గ్రామ దేవతల పున ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు శుక్రవారం(మొదటి రోజు) నిరర్వాహకుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మున్సిపాలిటీలోని పోచమ్మ, మైసమ్మ ఆలయాలతో పాటు ఎల్లమ్మ ఆలయాన్ని దాతల సహకారంతో కోట్లాది రూపాయలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఐదు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు వేదపండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 8.30 గంటల నుంచి కార్యక్రమాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గోపూజ గురుప్రార్థన, గణపతిపూజ పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశనం, దీక్షాధారణం, అఖండస్థాపనం, తీర్థప్రసాద వితరణ, యాగశాల ప్రవేశం నిర్వహించారు. సాయంత్రం మృత్యుంగ్రహణం, అంకురారోపణం, అగ్నిమథన, వాస్తుమర్మఘ్నీకరణం, మండదేవతాహోమం, మంగళహారతి, తీర్థప్రసాదవితరణ కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేదర్‌యాదవ్ దంపతులతో పాటు, పలువురు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గ్రామస్తులు పెద్దయెత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. కొత్తూర్ పట్టణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. విద్యుద్దీపాలంకరణతో భారీ స్వాగత తోరణాలు ఏర్పాటు చేసి ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. కౌన్సిలర్లు నర్సింహగౌడ్, హేమ దేవేందర్‌ముదిరాజ్, ప్రసన్నలత యాదయ్య, సోమ్లనాయక్, మాజీ ఎంపీపీ వేణుగోపాల్‌గౌడ్, నాయకులు కడెంపల్లి సదానంద్‌గౌడ్, బాతుక లక్ష్మయ్యయాదవ్, జె.సుదర్శన్‌గౌడ్, కడెంపల్లి శ్రీనివాస్, గోవింద్‌రెడ్డి, జంగగళ్ల కృష్ణయ్య, కమ్మరి జనార్దన్, జె. శ్రీనివాస్, మాసుల అంజయ్య, కర్రోళ్ల సురేందర్, మాదారం కృష్ణగౌడ్, వీరమోని వెంకటేష్, వీరమోని శ్రీనివాస్, బండి కృష్ణ, రాఘవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు చేస్తున్న సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 16 : ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మాజీ మంత్రి, మహేశరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎన్డీ తండాలో నూతనంగా ప్రతిష్ఠించిన పెద్దమ్మతల్లి విగ్రహ పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ గ్రామదేవతలైన పెద్దమ్మ, పోచమ్మ, మైసమ్మ, దుర్గమ్మలను ఆరాధించడం తర తరాలుగా వస్తుందన్నారు. బీజేపీ నాయకులు అందెల శ్రీరాములుయాదవ్, కాంగ్రెస్ నాయకులు కేఎల్లార్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, చంద్రయ్య, కె.ప్రభాకర్, రాజేష్, రాజునాయక్, దేశ్యానాయక్ శ్రవణ్, కృష్ణానాయక్, ప్రసాద్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, రవినాయక్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ శంషాబాద్ మున్సిపల్ శాఖ కార్యవర్గ సమావేశానికి హాజరైన కార్యర్గ సభ్యులు

శంషాబాద్‌ను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయొద్దు

శంషాబాద్, ఆగస్టు 16 : శంషాబాద్ మున్సిపాలిటీని జీహెచ్‌ఎంసీలో విలీనం చెయ్యొద్దని బీజేపీ శంషాబాద్ మున్సిపాలిటీ కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేశారు. బీజేపీ శంషాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్ అధ్యక్షతన స్థానిక బేగమ్స్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం కార్యవర్గ సమావేశం జరిగింది. శంషాబాద్ మున్సిపాలిటీని జీహెచ్ ఎంసీలో విలీనం చెయ్యొద్దని నాయకులు తీర్మానం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు భూమిలో ఇంటి నంబర్లు జారీచేసిన విషయమై కమిషనర్ వివరణ ఇవ్వాలని కోరారు. అస్తవ్యస్తంగా ఉన్న ఇంటినెబర్లను శాస్త్రీయ పద్ధతి ద్వారా సరిచేయాలన్నారు. కూరగాయల మార్కెట్‌తో పాటు పలుప్రాంతాల్లో తైబజార్ మున్సిపాలిటీ పాలకవర్గం అనుమతి లేకుండా వసూలు చేస్తున్నారని, దానిని నియంత్రించాలని కోరారు. ఇంటి, నీటి పన్నులు ఒక పద్ధతి ప్రకారం కాకుండా ఇష్టం వచ్చినట్టు వసూలు చేస్తున్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రేంరాజ్, నందకిశోర్, జగ్జీవన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, వీరేష్, ఆనంద్ భాస్కర్‌రెడ్డి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు

అవినీతి రహిత సమాజం రావాలి

ప్రజాప్రతినిధులు ఆదర్శంగా ఉండాలి

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు



సమావేశంలో మాట్లాడుతున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 16: అవినీతి రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు పిలుపునిచ్చారు. షాద్‌నగర్‌లో శుక్రవారం యూత్ ఫర్ యాంటీ కరప్షన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేంద్ర పల్నాటి అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో బక్కని మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు అవుతున్నా.. నేటికీ సమాజంలో అవినీతి పెరుగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వం జీతం ఇస్తుందన్న విషయాన్ని మర్చిపోయి, అవినీతికి తెగబడుతున్నారని ఆరోపించారు. కొన్ని కార్యాలయాల్లో ప్రతీ పనికి ఇంత అని లెక్కకట్టి తీసుకుంటున్నారని, చిన్నా, పెద్ద అనే తేడాలేకుండా కొందరు ఉద్యోగులు అక్రమార్జనకు పాల్పడుతున్నారని అన్నారు. ఎమ్మెల్యేలు సైతం ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చు పెట్టి, అధికారంలోకి రాగానే వందలు, వేల ఎకరాల భూములు, కోట్లాది రూపాయలను కూడబెట్టే సంస్కృతికి దూరం కావాలని కోరారు. సమాజంలో లంచం తీసుకోని అధికారులు ఎవరున్నారని వెతకాల్సి వస్తున్నదన్నారు. రాజేంద్ర పల్నాటి మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అవినీతిపై 12 ఏళ్లగా పోరాటం చేస్తున్నామని, నిజాయితీ పరులైన ప్రజాప్రతినిధులను, అధికారులను సైతం వెతికి వారిని సన్మానిస్తూ, సమాజానికి మార్గదర్శులుగా నిలుపుతున్నామని తెలిపారు. ఈనెల 25న హైదరాబాద్‌లో 20మంది నిజాయితీ అధికారులను సన్మానిస్తున్నట్టు తెలిపారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గాధిరాజు శ్రవంతి, కార్యవర్గ సభ్యుడు గంగాధర్‌లు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలకు ఉత్తమ పురస్కారం



అవార్డు అందుకుంటున్న నటరాజ్ యాదయ్య

ఆమనగల్లు, ఆగస్టు 16: సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకుగాను ఆమనగల్లు పట్టణానికి చెందిన ఆర్య వైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్, జిల్లా మెడికల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నటరాజ్ బిక్కుమళ్ల యాదయ్యకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ఆధ్వర్యంలో ప్రతీయేటా వివిధ రంగాల్లో సేవలందించిన వారికి పురస్కారాలు అందజేస్తారు. ఈ ఏడాది సామాజిక సేవలకు గాను యాదయ్యకు పురస్కారం లభించింది. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో జిల్లా కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అధ్యక్షుడు కృష్ణకుమార్ అవార్డు అందజేశారు. ఐదు దశాబ్ధాలుగా కల్వకుర్తి ప్రాంతంలో యాదయ్య అందిస్తున్న సేవలను వారు కొనియాడారు. సంఘం నాయకులు సత్యానారాయణ, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్రా రాష్ట్ర అధ్యక్షుడిగా వికారాబాద్ వాసి



ఎండీ యాసీన్‌ను సన్మానిస్తున్న సభ్యులు

వికారాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ ముస్లిం రైట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా వికారాబాద్‌కు చెందిన ఎండీ యాసీన్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన యునైటెడ్ ముస్లిం రైట్స్ అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎండీ యాసీన్ ఎన్నిక కాగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎండీ ఇంతియాజ్, సహ అధ్యక్షుడిగా ఎండీ హబీబ్, సంయుక్త కార్యదర్శిగా షేక్‌గౌస్ పాషా, సహ కార్యదర్శులుగా షేక్ షబ్బీర్, షేక్ నసీర్ హుస్సేన్, కార్యదర్శులుగా ఎండీ ఖలీల్, ఎండీ ఖదీర్, ఎండీ యూసుఫ్ అహ్మద్, ఎండీ అబ్దుల్ ఉమేర్, గౌరవ అధ్యక్షుడిగా ఎండీ చాంద్‌పాషా, సమన్వయకర్తగా షేక్ మౌలాలి ఎన్నికయ్యారు. ఆయన ప్రతిష్ఠాత్మకమైన సంస్థకు అధ్యక్షుడిగా ఎన్నిక కావడం తన బాధ్యతను పెంచిందన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి




పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై వెంకటేష్

ఆమనగల్, ఆగస్టు 16: డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రభుత్వం చేస్తున్న కృషిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని స్థానిక ఎస్సై బి.వెంకటేష్ కోరారు. విద్యార్థులు, యువత, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాల కోసం రూపొందించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లను శుక్రవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో డివైఎఫ్ఐ నాయకులతో కలిసి ఎస్సై ఆవిష్కరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు పవన్‌కుమార్, వినోద్, చంద్రశేఖర్, చంద్రకుమార్ పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన స్కిల్ హబ్ సిటీ నగరం ఏర్పాటు

- భూములు ఇచ్చిన రైతులకు ఒకేచోట ఇంటి స్థలం
- మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



బేగరికంచ గిరిజన మహిళలతో మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

కందుకూరు, ఆగస్టు 16: రాష్ట్ర ప్రభుత్వం కందుకూరు మండలంలో యుద్ధ ప్రాతిపాదికన నిర్మించతలపెట్టిన స్కిల్ హబ్‌సిటీ నాలుగో నగరం పనులు మరింత వేగవంతం చేయనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని బేగరికంచ గ్రామాన్ని కాంగ్రెస్ నాయకులతో కలిసి సందర్శించి, గ్రామస్తులు, పరిసర గ్రామాల ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ ఫార్మా ఇండస్ట్రీస్‌కు భూములు ఇచ్చిన రైతులందరికీ ఒకే చోట ఇంటిస్థలాన్ని కేటాయించి, ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.6లక్షలు, బీసీ, ఇతర కులాల రైతులకు రూ.5లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు సైబరాబాద్ నగరాలను గత పాలకులు ఎంతో అభివృద్ధి చేశారని, భావితరాల కోసం ఈ ప్రాంతంలో నాలుగవ నగరంగా ముచ్చర్ల ప్రాంతాన్ని మరింత వేగవంతంగా అభివృద్ధి చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు భూములను అమ్ముకోవద్దన్నారు. కాగా, ముందుగా అనుకున్నట్లుగా బేగంపేటలో అమెజాన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ భవనం శంకుస్థాపన పనులను నిలిపివేశారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో తమ గ్రామంలో కమ్యూనిటీ హాల్ భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయకపోవడం విడ్డూరంగా ఉందని గ్రామస్తులు బహిరంగంగానే ఆరోపించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శమంత ప్రభాకరరెడ్డి, మాజీ ఎంపీటీసీలు సరికొండ పాండు, నాయకులు ఎండీ అఫ్జల్‌బేగ్, బాలునాయక్, పాండుగౌడ్, రాంరెడ్డి, ఎస్.కృష్ణానాయక్, ఎస్డీ అజీజ్, సరికొండ జగన్, సరికొండ చిన్న జగన్, డిల్లీ శ్రీధర్, చంచు గణేష్, బొక్క భూపాల్‌రెడ్డి, బి.పాండురంగారెడ్డి, కృష్ణయ్య, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, ఈ.శ్రీకాంత్‌రెడ్డి, రాణా ప్రతాప్‌రెడ్డి, బొక్క సంజీవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఉద్రిక్తత

- మేనేజ్‌మెంట్ కోటా సీట్లు భర్తీ..
- చివరకు సీట్లు లేవన్న యాజమాన్యం
- విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

మేడ్చల్ టౌన్, ఆగస్టు 16: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. మేనేజ్‌మేంట్ కోటా (బీ కేటగిరి) కింద విద్యార్థులను భర్తీ చేసుకుని చివరికి సీట్లు లేవనడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో యాజమాన్యం వారు మేనేజ్‌మెంట్ కోటాకింది విద్యార్థులను భర్తీ చేసుకుని. డబ్బులు తీసుకోవటంతో పాటు సర్టిఫికెట్లను జమ చేసుకున్నారు. ప్రస్తుతం తీసుకున్న డబ్బులు, సమర్పించుకున్న సర్టిఫికెట్లను తిరిగి ఇచ్చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాల యాజమాన్యంతో గొడవపడి ఆందోళనకు దిగారు. సీట్ల కోటా తక్కువ ఉన్నప్పుడు విద్యార్థుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేయడం సమంజసం కాదని పలువురు ఆరోపించారు. కనీసం బీ కేటగిరి వివరాలు ఆన్‌లైన్‌లో చూసుకోవటానికీ వీలు లేకుండా కళాశాల వెబ్‌సైట్‌ను మూసేశారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. పిల్లలకు కళాశాలలో సీటు దొరికిందని సంబురపడగా కళాశాల యాజమాన్యం తమకు షాక్‌కు గురిచేసిందన్నారు. కళాశాల యాజమాన్యం వారు చెల్లించిన డబ్బులు తిరిగివ్వటంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొందని విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే క్రిమినల్ కేసులు



ఆసుపత్రిని సీజ్ చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వర్‌రావు

కొత్తూర్, ఆగస్టు 16: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆర్‌ఎంపీలు వైద్యం చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని జిల్లా వైద్యధికారి వెంకటేశ్వర్‌రావు హెచ్చరించారు. ఇటీవల ఓ గిరిజన బాలికకు కొత్తూర్‌కు చెందిన ఆయుర్వేద వైద్యుడు రంజిత్ అబార్షన్ చేసిన విషయం పాఠకులకు విధితమే. రంజిత్‌పై శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ విషయమై స్పందించిన డీఎంఅండ్‌హెచ్‌వో షాద్‌నగర్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విజయలక్ష్మీతో కలిసి రంజిత్ నడుపుతున్న శ్రీనివాసా ఆసుపత్రిని శుక్రవారం సీజ్ చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ ఆర్‌ఎంపీలు, పీఎంపీలు నిబంధనలకు విరుద్ధంగా స్థాయికి మించి, ప్రజలకు హాని కలిగించేలా వైద్యం చేస్తున్నారని మండిపడ్డారు. రంజిత్ ఆయుర్వేద వైద్యుడని, 13ఏళ్ల బాలికకు నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్ చేశాడని చెప్పారు. ఆర్‌ఎంపీ, పీఎంపీల చికిత్స కేంద్రాలను తనిఖీలు నిర్వహించి నోటీసులు జారీ చేసి, చికిత్స కేంద్రాలను సీజ్ చేస్తున్నా.. తిరిగి స్థాయికి మించి వైద్యం చేస్తున్నారని, అర్హత లేకున్నా ప్రథమ చికిత్స కేంద్రాల వద్ద భారీ బోర్డులు ఏర్పాటు చేసి వైద్యం చేస్తున్నారన్నారు. స్థాయికి మించి వైద్యం చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా మాస్‌మీడియా అధికారి తిరుపతిరావు, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ హరికిషన్, సీహెచ్‌వో నాగేష్, శ్రీకాంత్, నవాజ్, ఆశాలు పాల్గొన్నారు.


మోమిన్‌పేట్: ఎన్కతలలో వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న పురోహితులు


ధారూరు: ధారూరులో ముత్తైదువులకు వాయినాలు ఇస్తున్న మహిళ


పరిగి: శిశుమందిర్ పాఠశాలలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు


పెద్దేముల్: వరలక్ష్మీ వ్రతంలో మహిళలు

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

వికారాబాద్, ఆగస్టు 16: వికారాబాద్‌లో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని వరలక్ష్మీ వ్రత పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని రామ మందిరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో, వైభవలక్ష్మీ ఆలయంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించారు. ఇళ్లలోనూ వరలక్ష్మీ పూజలు చేశారు.

మోమిన్‌పేట్: మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళలు ఉపవాస దీక్షలతో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. అమ్మవారిని అలంకరించి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ముత్తైదువులకు అన్నప్రసాదం అందించారు.

ధారూరు: ధారూరులో శుక్రవారం శ్రావణ మాసం సందర్భంగా ఇళ్లలో మహిళలు వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లక్ష్మీదేవతకు పూజలు చేసి నైవేద్యం సమర్పించి హారతులిచ్చి మొక్కుకున్నారు. ముత్తైదువులకు పసుపు, కుంకుమలతో వాయినాలు సమర్పించారు.

తాండూరు: తాండూరుతో పాటు పరిసరాల ప్రాంతాలు, ఆలయాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇళ్లలో లక్ష్మీదేవి, గణపతి విగ్రహాలు, చిత్రపటాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. అనంతరం వాయినాలు సమర్పించారు. తాండూరులో పలు పాఠశాలల్లో సంప్రదాయబద్ధంగా వ్రతాన్ని నిర్వహించారు.

తాండూరు రూరల్: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఇంటింటా వరలక్ష్మీవ్రతాన్ని ఆచరించారు. శ్రావణమాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం కావడంతో మహిళలంతా పూజలు నిర్వహించారు. ముత్తయిదువులకు పసుపు, కుంకుమ ఇచ్చి వాయినాన్ని అందించారు. దీంతో ప్రతి ఇంటా పండుగ వాతావరణం ఉట్టిపడింది.

పరిగి: పట్టణంలోని శ్రీసరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో శుక్రవారం వరలక్ష్మీవ్రతం, మాతృసమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో ఈరెపల్లి వరలక్ష్మి, హిందీ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, హెచ్‌ఎం మల్లేశ్ పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: శ్రావణ శుక్రవారంను పురస్కరించుకుని మండలంలో వరలక్ష్మీ వ్రతాలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని రెండవ వార్డులో శుక్రవారం మాజీ కౌన్సిలర్ మధుసూదన్, మాజీ వ్యవసాయ మార్కెట్ వైస్‌చైర్మన్ వాణిశ్రీ దంపతుల నివాసంలో వరలక్ష్మీవ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకంగా మండపాన్ని ఏర్పాటుచేసి పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మహిళలకు వాయినాలు, తీర్థప్రసాదాలు అందించారు.

ఘట్‌కేసర్: ఘట్‌సర్, పోచారం మున్సిపాలిటీల్లో శుక్రవారం మహిళలు వరలక్ష్మీవ్రతంను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లోనూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానంగా ఇళ్లల్లో మహిళలు అమ్మవారిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజులు నిర్వహించారు. తోటి మహిళలకు పసుపుకుంకుమలను అందజేశారు.

ఘట్‌కేసర్ రూరల్: వరలక్ష్మీ వత్రం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఘట్‌కేసర్ మండలంలోని ఎదులాబాద్ శ్రీ గోదా సమేత శ్రీమన్నారు రంగనాయక స్వామి దేవాలయం, శ్రీశ్రీశ్రీ సత్యనారాయణస్వామి ఆలయం, కొర్రెములలోని శ్రీశ్రీశ్రీ మహంకాళి ఆలయం, మర్రిపల్లిగూడలోని శ్రీదుర్గమాత ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కల్యాణం కనుల పండువగా జరిగింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. అమ్మవారు మహిళలు ఓడిబియ్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు, మాజీలు సర్పంచ్ ఓరుగంటి వెంకటేష్‌గౌడ్, ఓరుగంటి కవితావెంకటేష్‌గౌడ్, నాయకులు పసుమాల కృష్ణ, బాల్‌రాజ్, కోళ్ల యాదగిరి, భాస్కర్ రెడ్డి, సుధాకర్, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

కీసర: కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో వరలక్ష్మీవత్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని లక్ష్మీదేవికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.


కీసర: కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

శామీర్‌పేట: శామీర్‌పేట, తూంకుంట మున్సిపల్ పరిధిలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం వరలక్ష్మీ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతీ శ్రావణమాసం పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం నాడు వరలక్ష్మీ పూజలు జరుపుకోవడం అనావాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో ఉపవాసం ఉండి వ్రతంలో పాల్గొన్నారు. ముత్తైదువలకు వాయినాలను సమర్పించారు.


శామీర్‌పేట: పూజల్లో పాల్గొన్న మహిళలు


కొడంగల్ రూరల్: మాజీ కౌన్సిలర్ ఇంట్లో వరలక్ష్మీ వ్రతం


తాండూరు రూరల్: వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు


తాండూరు: తాండూరులో వ్రతంలో శంకర్ యాదవ్ దంపతుల పూజలు


ఘట్‌కేసర్: శివారెడ్డిగూడలోవరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

కనుల పండువగా వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

శామీర్‌పేట, ఆగస్టు 16: శామీర్‌పేటలోని శ్రీవీరభద్రస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు గడియారం మురళీధర్‌శర్మ ఆధ్వర్యంలో 18మంది వేదబ్రహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య పూజలు చేశారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, స్థాపితదేవత హవనములు, తత్వహోమాలు, దేవతా మూర్తులకు సామూహిక అభిషేకాలు తదితర పూజలు చేశారు. అనంతరం ధాన్య శైవాసం, ఛండీ హోమం నిర్వహించారు.


ఛండీ హోమంలో పాల్గొన్న భక్తులు

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న దళిత సంఘాల నాయకులు

బషీరాబాద్, ఆగస్టు 16: కేసు విచారణ పేరుతో మండలంలోని నవాల్ల గ్రామానికి చెందిన దళిత మహిళను వేధిస్తూ చిత్రహింసలకు గురిచేస్తున్న ఎస్ఐపై తగుచర్యలు తీసుకోవాలని దళిత ప్రజా సంఘాల జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డిని కలిసి శుక్రవారం ఫిర్యాదు చేశారు. అంతకు ముందు బషీరాబాద్ ఠాణా ఎదుట బాధిత మహిళతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. డీఎస్పీని కలిసిన వారిలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యు.బుగ్గప్ప, ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి డి.మహేందర్, పి.ఆనంద్‌కుమార్, బి.కృష్ణా, సురేష్ ఉన్నారు.

కేటీఆర్ మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి


పూడూరు: మన్నెగూడ చౌరస్తాలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


కులకచర్ల: చౌరస్తాలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఘట్‌కేసర్, ఆగస్టు 16: తెలంగాణ రాష్ట్ర మహిళాలోకానికి బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కేటీఆర్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ నాయకురాలు ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ డిమాండ్ చేశారు. నియోజక వర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ పిలుపుమేరకు శుక్రవారం ఘట్‌కేసర్‌లో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే జీర్ణించుకోలేని కేటీఆర్ మహిళపట్ల నోటికొచ్చినట్లు మాట్లాడటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు బ్రేక్ డ్యాన్సులు, రికార్డింగ్ డ్యాన్సులు చేసుకోవచ్చని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు మహిళలను కించపర్చేలా ఉన్నాయని తెలిపారు. ఇప్పటికైనా ఆయన దిగొచ్చి వెంటనే మహిళాలోకానికి క్షమాపణలు చెప్పాలని లేదంటే మహిళల సత్తా ఎమిటో చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంజిరెడ్డి, నాగరాజు, వెంకటేష్, నర్సింగ్‌రావు, పారూక్, రాజారత్నం, అబ్దుల్ ఖయ్యూం, విజయ్, సునీల్, రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పూడూరు: మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్ ట్యాంక్ బండ్ వద్దకు వచ్చి బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు బాలమణి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మన్నెగూడ చౌరస్తాలో శుక్రవారం బాలమణి కాంగ్రెస్ నాయకులతో కలిసి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సురేందర్, కండ్లపల్లి శ్రీనివాస్, అజీం పటేల్, నర్సింహారెడ్డి, మహిపాల్‌రెడ్డి, రాఘవేందర్, శ్రీనివాస్, రాములు పాల్గొన్నారు.

కులకచర్ల: రాష్ట్రంలోని మహిళలపై చేసిన వ్యాఖ్యలకు నిరసిస్తూ శుక్రవారం కులకచర్ల చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్ఎస్ పార్టీ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్ రెడ్డి, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మండల యూత్ అధ్యక్షుడు జంగయ్య, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్ పాల్గొన్నారు.

దోమ: బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని దిర్సంపల్లి ప్రధాన చౌరస్తాలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేటీఆర్ వెంటనే మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి రమేశ్‌గౌడ్, సీనియర్ నాయకులు బంగ్లా యాదయ్యగౌడ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జయమ్మ, దిర్సంపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు సత్తయ్యగౌడ్ పాల్గొన్నారు.


కొడంగల్: దిర్సంపల్లి చౌరస్తాలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సంక్షిప్తంగా..

● **కీసర రూరల్:** నాగారం మున్సిపాలిటీలోని ముప్పు ఎల్లారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో విశ్వవిష్ణు సహస్ర నామ సంస్థాన్ ఆధ్వర్యంలో విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెరినిటీ పాఠశాలకు చెందిన వెయ్యి మంది విద్యార్థులు, పాఠశాల కరస్పాండెట్ నోముల జంగిరెడ్డి, పాఠశాల డైరెక్టర్ నోముల వసంత, విశ్వ విష్ణు సహస్ర నామ సంస్థాన్ ప్రతినిధులు కమలాకుమారి, పద్మజారావు, రాధిక మహీంద్రికర్, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

● **దోమ:** జిల్లా కేంద్రంలో గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ప్రతీక్‌జైన్ చేతుల మీదుగా టైపిస్టు వెంకటేశ్ ప్రశాంస పత్రం అందుకున్నారు. వెంకటేశ్‌కు శుక్రవారం కార్యాలయంలో ఎంపీడీవో మహేశ్‌బాబు, సిబ్బంది పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

● **తాండూరు:** తెలంగాణ జనసమితి (టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పదవి ఇవ్వాలని టీజేఎస్ తాండూరు ఇన్‌చార్జి సాంబూరు సోమశేఖర్ అన్నారు. తెలంగాణ గవర్నర్ కోటాలో శుక్రవారం ఎమ్మెల్సీగా కోదండరాం ప్రమాణ స్వీకారం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

● **ఘట్‌కేసర్:** ఈగలు, దోమల నివారణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో పంచర్ షాపులు, వివిధ దుకాణలతోపాటు రోడ్డుకిరువైపులా చెత్తాచెదారం తొలగించి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. ప్రతీ శుక్రవారం 10 నిమిషాలు కేటాయించి డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో శేఖర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

● **దౌల్తాబాద్:** బాలంపేట, తిమ్మారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన కావలి లక్ష్మి, అన్వర్‌పాష తమ ఫోన్లు చోరీకి గురయ్యాయని దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన ఎస్ఐ రవి గౌడ్ సీఈఐఆర్ యాప్ ద్వారా ఫోన్ల ఆచూకీ గుర్తించి శుక్రవారం బాధితులకు అందజేశారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** కోలకత్తాలో జరిగిన వైద్యురాలి లైంగికదాడి ఘటనకు నిరసనగా నీలిమా ఆస్పత్రిలో నేడు శనివారం ఓపీ (అవుట్ పేషంట్) నిలిపివేయనున్నట్లు ఆస్పత్రి సీవోవో సూర్యదేవర నీలిమా తెలిపారు. అత్యవసర సేవలు మాత్రమే ఉంటాయని తెలిపారు.

● **వికారాబాద్:** బీజేపీ మండల అధ్యక్షుడు రాఘవేందర్‌పై జరిగిన దాడిని ఖండిస్తున్నట్లు బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు సదానందరెడ్డి పేర్కొన్నారు. ఈ విషయమై శుక్రవారం స్థానిక చెన్‌గోముల్ పోలీసు స్టేషన్, ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రయ్య, రాము యాదవ్, కంకల్ రవీందర్ పాల్గొన్నారు.

● **ధారూరు:** కేరెల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన కొండాపూరుకుర్దు గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ప్రభుత్వం ప్రకటించటం హర్షణీయమని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

● **తాండూరు రూరల్:** మండలంలోని జినుగుర్తికి చెందిన అజ్మత్‌అలీ ఇటీవల తాండూరు మండల మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. అయితే అదే గ్రామంలో పాఠశాల హెచ్‌ఎం నాగప్ప ఆధ్వర్యంలో గ్రామస్తులు కాంగ్రెస్ నాయకులతో కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం మృత్యుంజయ స్వామి, ప్రవీణ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, దేవయ్య, శామప్ప, రాములు, బాలప్ప, భాస్కర్, దేవదాస్ పాల్గొన్నారు.

● **బొంరాస్‌పేట్:** మండలంలోని తుంకిమెట్లలో సీఎం నిధులతో నూతన బోరును ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ మండల నాయకులు బాల్‌రాజ్ తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తిన విషయం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో నూతన బోరును వేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు హనీఫ్, తోలు వెంకటయ్య, మోహన్‌రెడ్డి, అంజిల్‌రెడ్డి, కావలి గోవర్ధన్‌యాదవ్, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

● **కులకచర్ల:** బంగ్లాదేశ్‌లో హిందువులపై, హిందు దేవాలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నేడు(శనివారం) కులకచర్ల బంద్‌కు పిలుపునిచ్చినట్లు హిందూ ఐక్యవేదిక సంఘం నాయకులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

● **బషీరాబాద్:** మండలంలోని భోజ్యానాయక్ తండాలో వ్యవసాయ పొలాల్లోని వర్షం నీటి వరద తండాలోకి వస్తుందని పాటు కాల్వను నిర్మిస్తున్నారు. ఈ కాల్వ నిర్మాణానికి నిధులు మంజూరు కాకున్నా తండాలోని పెద్ద, నవాంద్లీ సొసైటీ డైరెక్టర్ రుప్లానాయక్ ముందుకు వచ్చి తన సొంత డబ్బులు ఖర్చుచేసి సీసీ బెడ్డుతో కాల్వను నిర్మింపజేస్తున్నారు. ఈ విషయమై తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని ఆయన నిధులు మంజూరు చేయిస్తానని చెప్పడంతో ఈ కాల్వ నిర్మాణం ప్రారంభించినట్లు ఆయన అన్నారు.

● **కొడంగల్:** వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్ తెలిపారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మున్సిపల్ సిబ్బంది ఆంజనేయులు ఉన్నారు.

క్రైం కార్నర్

ఫ్రూట్ జ్యూస్‌లో పురుగులు

● జ్యూస్ సెంటర్ సీజ్


పురుగులు పట్టిన ఫ్రూట్ జ్యూస్

తాండూరు, ఆగస్టు 16: ఆశపడి కోనుగోలు చేసిన ఫ్రూట్ జ్యూస్‌లో పురుగులు దర్శనమిచ్చాయి. దీంతో కొనుగోలుదారుడు అధికారులకు సమాచారం అందించగా కల్తీ విక్రయాల గుట్టురట్టయ్యింది. తనిఖీల్లో కుళ్లిన పండ్లు లభ్యమయ్యాయి. విక్రయాలకు పాల్పడుతున్న జ్యూస్ సెంటర్‌ను సీజ్ చేశారు. ఈ ఘటన శుక్రవారం తాండూరు పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే తాండూరు పట్టణం ఇందిరా చౌరస్తా సమీపంలో ఓ వ్యాపారి మిలాప్ జ్యూస్ సెంటర్ పేరుతో వ్యాపారం చేస్తున్నాడు. అయితే పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో వారి కోసం జ్యూస్ సెంటర్‌లో ఫ్రూట్ జ్యూస్ కోనుగోలు చేశాడు. తీరా వ్యక్తి ఇంటికి వెళ్లి చూసేసరికి అందులో పురుగులు దర్శనమిచ్చాయి. వెంటనే ఆ యువకుడు జ్యూస్ సెంటర్ వచ్చి నిలదీశాడు. ఇంట్లో పిల్లలు తిని అనారోగ్యానికి గురైతే ఎవరిది బాధ్యత అంటూ ప్రశ్నించారు. ఈ విషయం మున్సిపల్ అధికారులకు తెలపడంతో వారు జ్యూస్ సెంటర్ వద్దకు వచ్చారు. దుకాణంలో జ్యూస్, పండ్లను పరిశీలించగా కుళ్లిపోయినట్లు గుర్తించారు. తయారు చేసిన జ్యూస్‌లు కూడా కల్తీగా మారడంతో వాటిని స్వాధీనం చేసుకుని దుకాణాన్ని సీజ్ చేశారు. ఈ తనిఖీలో టీపీఎస్ అశోక్‌కుమార్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్, జవాన్లు పాల్గొన్నారు.

అనుమానిత వ్యక్తి పోలీసులకు అప్పగింత


పోలీసుల అదుపులో వ్యక్తి

దోమ, ఆగస్టు 16: మండలంలోని పలుగుతండా గ్రామ పంచాయతీ పరిధిలోని సామనగడ్డ తండాలో అనుమానితుడిగా కనిపించిన ఓ వ్యక్తిని తండావాసులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. పలుగుతండాలో గురువారం రాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించగా అతన్ని గ్రామస్థులు వెంబడించారు. దీంతో ఆ వ్యక్తి చెట్టుపైకి ఎక్కి హల్‌చల్ చేశాడు. దీంతో తండావాసులు ఆ వ్యక్తిని పట్టుకొని దేహశుద్ధి చేసి దోమ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వ్యక్తిని కొట్టడంతో గాయాలవడంతో చికిత్స చేయించి వదిలిపెట్టారు. అతడితో పాటు మరో ఇద్దరు వ్యక్తులు కూడా పరారైనట్లు గిరిజన తండావాసులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయంపై ఏఎస్ఐ సూర్యనారాయణను వివరణ కోరగా అతడు బీహార్‌కు చెందిన వ్యక్తి అని, ఎలాంటి దొంగతనాలకు పాల్పడలేదని తెలిపారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఆ వ్యక్తిని వదిలిపెట్టినట్లు తెలిపారు.

ఉరేసుకొని కూలీ ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 16: ఉరేసుకొని కూలీ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌లోని సీతామర్హి జిల్లా, రున్నిసైదాపూర్‌లోని రాంపూర్‌తోలాకు చెందిన అభిషేక్ కుమార్(20) దమ్మాయిగూడ మున్సిపల్‌లో ఉంటూ కూలీపనులు చేస్తుంటాడు. రోజువారీ కూలీలో భాగంగా అభిషేక్‌కుమార్ ఈనెల 15న ఘట్‌కేసర్ మున్సిపల్‌లోని శివారెడ్డిగూడలోని శ్రీనివాస్‌రావుకు చెందిన ఇటుకబట్టీలో పనిచేయడానికి వచ్చాడు. పని ముగియగానే ఇంటికి వెళ్లకుండా రాత్రి అక్కడే షెడ్‌లో పడుకున్నాడు. ఉదయం అభిషేక్ కుమార్‌కు ఫోన్‌చేస్తే స్పందించకపోవడంతో అతడి షెడ్‌లోకి వెళ్లిచూడగా చున్నీతో రాడ్‌కు ఉరేసుకుని కనిపించాడు. దీంతో శ్రీనివాస్‌రావు పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. ఇటీవల కిడ్నీరాళ్ల సమస్యతో బాధపడుతున్నట్లు మృతుడి సోదరుడు జితేందర్‌రాయ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. అభిషేక్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి ఆందోళన

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 16: పెళ్లి చేసుకుంటానని మోసం చేసి విదేశాలకు వెళ్లిన ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు ఆందోళనకు దిగింది. బాధితురాలి కథనం ప్రకారం.. ఘట్‌కేసర్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువతి(25) అదే గ్రామానికి చెందిన సాయి గత ఆరు సంవత్సరాలుగా ప్రేమించుకున్నారు. రెండేళ్ల కిందట పైచదువుల నిమిత్తం విదేశాలకు వెళ్లాడు. ఇంటికి వచ్చిన తర్వాత పెళ్లి చేసుకుంటానని చెప్పి, ఆరునెలలుగా తనను దూరం పెడుతున్నాడని బాధిత యువతి ఆరోపించింది. తనను మోసం చేశాడని భావించిన యువతి శుక్రవారం ప్రియుడి ఇంటి ముందు ఆందోళనకు దిగింది. ఇద్దరి సామాజిక వర్గాలు వేర్వేరు కావడం వల్లే అతడి కుటుంబసభ్యులే తన ప్రియుడిని కలవనియడం లేదని, ఫోన్ మాట్లాడనివ్వడం లేదని వాపోయింది. ప్రస్తుతం ప్రియుడు సాయి ఇండియాకు వచ్చి బంధువుల ఇంటి వద్ద ఉన్నాడని తెలిపింది. కుటుంబసభ్యుల సాయంతో ఆమె ఘట్‌కేసర్ పోలీసులను ఆశ్రయించి తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేసింది. సదరు యువతిపై సాయి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడం గమన్హారం. ఇరువురి ఫిర్యాదుల మేరకు కేసు దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇచ్చిన హామీ నెరవేర్చాం: అసెంబ్లీ స్పీకర్


స్పీకర్ ప్రసాద్ కుమార్‌తో కురుగుంట గ్రామస్థులు

మర్పల్లి, ఆగస్టు 16: 'ఇచ్చిన హామీ నేరవేర్చాం.. గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవాలి' అని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మండలంలోని పెద్దపూర్ అనుబంధ గ్రామం కురుగుంట, ఘనపూర్ అనుబంధ గ్రామం రాంపూర్ నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు కావడంతో కురుగుంట గ్రామానికి చెందిన గ్రామస్థులు గడ్డం ప్రసాద్‌కుమార్‌ను శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కురుగుంట గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటుచేస్తానని హామీ ఇవడంతో ప్రభుత్వం పంచాయతీగా ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండల్ రెడ్డి, నాయకులు సుభాష్‌యాదవ్, రాములు, కృష్ణారెడ్డి, రామేశ్వర్, సురేశ్, సంజీవరెడ్డి, అబ్రహం పాల్గొన్నారు. కాగా, నూతన గ్రామ పంచాయతీగా ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో శుక్రవారం గ్రామస్థులు సంబరాలు జరుపుకున్నారు.

వ్యవసాయాధికారుల బదిలీ

వికారాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న పలువురు వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు బదిలీ అయ్యారు. ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్‌లో జిల్లాలో పనిచేస్తున్న 10 మంది వ్యవసాయాధికారులు, 24 మంది వ్యవసాయ విస్తరణ అధికారులను బదిలీచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 10మంది వ్యవసాయాధికారులు బదిలీ కాగా, వారిలో ఒకరు మాత్రమే జిల్లాలో ఒక స్థానం నుంచి మరొక స్థానానికి బదిలీ కాగా, తొమ్మిది మంది ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు. వారి స్థానాల్లో ఇతర జిల్లాల నుంచి ఐదుగురు వ్యవసాయాధికారులను మాత్రమే జిల్లాకు కేటాయించారు. జిల్లాలో బదిలీ అయిన ఏఈవోల్లో ఇతర జిల్లాలకు ఎక్కువ మందిని కేటాయించగా, వారి స్థానాల్లో తక్కువ మందిని కేటాయించారు. జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో పనిచేసి బదిలీ అయిన వ్యవసాయాధికారుల్లో కృష్ణకాంత్ సూర్యాపేట్ జిల్లాకు బదిలీ కాగా, ఝాన్సీ సంగారెడ్డి జిల్లాకు, పాండురంగాచారి యాదాద్రి భువనగిరి జిల్లాకు బదిలీ అయ్యారు. బంట్వారం, కోట్‌పల్లి, మర్పల్లి, బొంరాస్‌పేట్ వ్యవసాయాధికారులు బదిలీ అయిన వారిలో ఉన్నారు. వారిని శుక్రవారం సాయంత్రం రిలీవ్‌చేస్తూ డీఏవో గోపాల్ ఉత్తర్వులు అందజేశారు.

మా గ్రామాలను మేడ్చల్ జిల్లాలోనే కొనసాగించాలి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 16 : ఘట్‌కేసర్ మండంలోని అవుషాపూర్, అంకుశాపూర్, మాదారం గ్రామాలను యాదాద్రీ జిల్లాలో కలుపొద్దని మూడుగ్రామాల నాయకులు శుక్రవారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతి అందజేశారు. ఈ మూడు గ్రామాలను యాదావిధిగా ఘట్‌కేసర్ మండలంలోనే కొనసాగించాలని కోరారు. యాదాద్రీ జిల్లాలో కలిపితే అన్ని రకాలుగా వెనుకబడి పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు మాజీ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, చలువాది ప్రవీణ్‌రావు, పన్నాల కొండల్‌రెడ్డి, ఎల్సాని అయిలయ్యయాదవ్ కవాడి వామన్‌రెడ్డి, మశ్చేందర్‌రెడ్డి, శోభారాణి, కొట్టి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి

తాండూరు, ఆగస్టు 16: భారత రత్న మాజీ ప్రధాన మంత్రి దివంగత వాజ్‌పేయి వర్ధంతిని శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలను కొనియడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు.రమేష్ కుమార్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం, ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శాంతికుమార్, పట్టణ ఉపాధ్యక్షులు ప్రకాష్, దోమ కృష్ణ, బూత్ అధ్యక్షుడు వడ్డె సాయి, బాబులు ఉన్నారు.